

# రియాల్టీ గేమ్ ఛేంజర్... ట్రిపులార్

- మారనున్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ స్వరూపం
- రీజనల్ రింగు రోడ్డుతో సరికొత్త అవకాశాలు
- జిల్లాలకు విస్తరించనున్న హైదరాబాద్ ఆర్థిక వృద్ధి

..మిగతా 4 లో



# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ 05.01.2025 | 24 క్యారెట్లు 80,215.00 | కిలో వెండి 1,07,000.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:75

www.vishalabharati.com

## మాస్కులు పెట్టుకోండి!

- ఫ్లూ లక్షణాలు ఉంటే తప్పనిసరి
- చైనా వైరస్ వ్యాప్తితో వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరిక
- రాష్ట్రంలో హెచ్ఎంపీవీ వైరస్ కేసులు లేవు
- హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్(హెచ్ఎంపీవీ) కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తెలంగాణలో ఈ తరహా కేసులు ఎక్కడా లేవని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ రవీందర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. హెచ్ఎంపీవీ వైరస్ చలికాలంలో జలుబు, సాధారణ ఫ్లూ లక్షణాలు కలగజేస్తుందని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని తెలిపారు. ఈ వైరస్‌పై భయాందోళనలు అక్కర్లేదన్నారు. కేంద్ర ప్రభుత్వంతో

..మిగతా 2 లో



## రైతుభరోసా.. ఎకరాకు రూ.12,000



- సాగు చేసే ప్రతి భూమికీ వర్తింపు
- ఎలాంటి నిబంధనలూ లేవు
- రైతు కూలీలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా
- అర్హులకు ఏడాది రూ.12వేలు
- రేషన్ కార్డులు లేని పేదలకు కొత్త కార్డులు
- జనవరి 26 నుంచి మూడు పథకాల అమలు
- కేబినెట్ వివరాలు వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి
- పంచాయతీ రాజ్ శాఖలో 588 కారుణ్య నియామకాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతుభరోసా పథకం ప్రతి ఏటా రూ.12వేలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. జనవరి 26వ తేదీ నుంచి దీన్ని అమలుచేస్తామని తెలిపారు. అదే రోజు నుంచి భూమిలేని రైతు కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద సంవత్సరానికి రూ.12వేలు చెల్లిస్తామని తెలిపారు. అలాగే రాష్ట్రంలో రేషన్ కార్డులు లేని నిరుపేదలకు ఆ రోజు నుంచే కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు వివరించారు. శనివారం నాడు సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశం ముగిసిన అనంతరం స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి కొత్త సంవత్సరంలో మంచి జరగాలని, వ్యవసాయాన్ని పండగ చేయాలని ప్రభుత్వం పట్టుదలతో చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకున్నాం. వీటికి సంబంధించి ఇప్పటివరకు ప్రసార సాధనాలు ఊహాగానాలతో గందరగోళం సృష్టించాయి. వీటిని పటాపంచలు చేస్తూ మా సహచర మంత్రుల సూచనల

..మిగతా 2 లో



## రైతుభరోసా రూ.15వేలు ఇవ్వాల్సిందే..

- ఎన్నికల హామీలను కాంగ్రెస్ విస్మరించింది
- కేంద్ర మంత్రి బండి సంజయ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

..మిగతా 2 లో



## సంక్రాంతికి అదనపు బాదుడు

### ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు చార్జీ

- 6432 స్పెషల్ బస్సుల ఏర్పాటు
- టీజీఎస్ఆర్టీసీ వెల్లడి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారి కోసం టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రయాణికులకు సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు 6,432 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. అందులో 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. మహాలక్ష్మీ పథకంలో

..మిగతా 2 లో

## రేవంత్ చేతగాని సీఎం



- పర్రెపడ్డది మేడిగడ్డకు కాదు.. సీఎం బుర్రకు
- ఆరు గ్యారెంటీల్లో అర గ్యారంటీ మాత్రమే అమలు
- వందశాతం అమలైతే రాజకీయ సన్యాసం చేస్తా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పర్రెపడ్డదని మేడిగడ్డ బరాజ్ కాదని.. రేవంత్‌రెడ్డి బుర్రకని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు సెటైర్లు వేశారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ మాత్రమే అమలైందన్నారు. రెండు లక్షల రుణమాఫీ.. వందశాతం అమలైతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని అసెంబ్లీలో చెప్పానన్నారు. కాంగ్రెస్‌కు పరిపాలన చేతకావడం లేదని.. చేతగాని సీఎం రేవంత్‌రెడ్డి అంటూ విమర్శించారు.సర్వశిక్ష

..మిగతా 2 లో



## కులం పేరిట కుట్రలు

- సమాజంలో విషం వెదజల్లుతున్నారు
- కుల రాజకీయాలతో శాంతిభద్రతలకు విఘాతం
- వారి ప్రయత్నాలు తిప్పికొట్టాలి
- ప్రధాని నరేంద్ర మోడీ

**విశాలభారతి, నేషనల్‌బ్యూరో:**

కులం పేరిట సమాజంలో విషం వెదజల్లుతోందని ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్ర మోడీ శనివారం విరుచుకుపడ్డారు. గ్రామాల సంస్కృతిని, వారసత్వ సంపదను సుదృఢం చేసే లక్ష్యంతో అటువంటి కుట్రలను భగ్నం చేయవలసిందిగా

..మిగతా 2 లో



## పోలవరంతో భద్రాచలానికి ముప్పు ఎంత?

- ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం
- బనకచర్లపై అభ్యంతరాలు తెలపాలి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణపై పడే ప్రభావంపై అధ్యయనం చేయాలని

..మిగతా 2 లో

## అమ్మాయిల వాష్ రూమ్‌లో.. సీక్రెట్‌గా వీడియో షూటింగ్




- మహబూబ్‌నగర్‌లో కలకలం
- పాలటెక్నిక్ కాలేజీలో ఘటన
- మొబైల్‌తో రికార్డు చేసినట్లు గుర్తింపు
- కాలేజీ ఎదుట విద్యార్థినుల ఆందోళన
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో మరో కాలేజీలో అమ్మాయిల వాష్ రూంలో వీడియో కలకలం చెలరేగింది. ఇప్పటికే హైదరాబాద్‌లోని కండ్లకోయ సీఎంఆర్ కాలేజీలో బాత్రూంలో వీడియోల చిత్రీకరణ సంచలనం రేపింది. తాజాగా, మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో కెమెరా కలకలం సృష్టించింది. ఈ కాలేజీలోని గర్ల్స్ టాయిలెట్‌లో మొబైల్ కెమెరాను పెట్టారు. తమ వాష్‌రూంలో మొబైల్‌తో వీడియోలు రికార్డ్ చేస్తున్నట్లు గుర్తించిన విద్యార్థినులు నేడు కాలేజీ ఎదుట నిరసనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆందోళనకు పలు విద్యార్థి సంఘాలు మద్దతు పలికాయి. విషయం తెలియడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. విచారణ జరిపిన

..మిగతా 2 లో



## ఎమ్మెల్యే క్వార్టర్స్ ఖాళీ చేయాల్సిందే

- కరెంటు, నీటి సరఫరా నిలిపివేస్తాం
- ఆదర్శ్‌నగర్‌లో ఉంటున్న వారికి నోటీసులు
- కాన్‌స్టిట్యూషన్ క్లబ్ నిర్మాణం

2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
vishalabharathi Telugu Daily
ఆదివారం,
05.01.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# మాస్కులు పెట్టుకోండి!

తరువాయి భాగం

సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని చెప్పారు. జలుబు, ఫ్లూ లక్షణాలు కలిగి ఉన్న వారు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. తుమ్ములు, దగ్గు వచ్చినపుడు చేతి రుమాలు లేదా టిష్యూ పేపర్‌ను అడ్డుపెట్టుకోవాలని, చేతులను తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. కరచాలనం చేయడం, జబ్బు చేసిన వారి దగ్గరకు వెళ్లడం, కళ్లు, ముక్కును తరచూ తాకడం, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం, వైద్యులను సంప్రదించకుండా మందులు వాడడం లాంటివి చేయొద్దని రవీందర్‌నాయక్ సూచించారు. ఫ్లూ లక్షణాలు ఉన్న వారు మాస్కులు ధరించాలని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు నమోదు కాలేదని స్పష్టం చేసింది. కానీ జలుబు, దగ్గు లక్షణాలు ఉన్నవారు సమూహాలకు దూరంగా ఉండాలని సూచించింది.



# సంక్రాంతికి అదనపు బాదుడు

తరువాయి భాగం

భాగంగా సంక్రాంతికి నడిపే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం అమల్లో ఉంటుందని తెలంగాణ ఆర్టీసీ స్పష్టం చేసింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రం 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ఆర్టీసీ వెల్లడించింది.

పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సులు నడపడానికి ప్రస్తుతం కరీంనగర్, నిజామాబాద్ నుంచి ఏర్పాట్లు పూర్తయినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో కూడా అందుబాటులో ఉన్నట్లు ఆర్ఎం శ్రీలత తెలిపారు. మహాలక్ష్మీ పథకం వల్ల రద్దీ పెరిగినా దానికీ అనుగుణంగా అదనపు బస్సులను ఏర్పాటు చేసుకుని సిద్ధంగా ఉన్నాయని, మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నామని ఆమె తెలిపారు. రోజు వారీగా నడిపే బస్సుల్లో అదనపు ఛార్జీలు ఏమీ ఉండవని స్పష్టం చేశారు. కానీ పండుగ సందర్భంగా నడిపే అదనపు సర్వీసు బస్సులకు మాత్రం 50 శాతం అదనంగా ఛార్జీలు ఉంటాయని తెలిపారు.

# రేవంత్ చేతగాని సీఎం

తరువాయి భాగం

అభియాన్ ఉద్యోగులు రెగ్యులేషన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలో నాలుగు లక్షల పెళ్లిళ్లు అయ్యాయని.. వారికి కల్యాణలక్ష్మి ఇవ్వలేదన్నారు. రూ.7500 రైతుబంధు కాదుకదా.. 75 పైసలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతు ప్రమాణపత్రం కేసీఆర్ హయాంలో అడుగలేదని.. రైతుబంధు ఇచ్చామన్నారు. 12 దఫాల్లో రూ.80వేలకోట్లు రైతుల ఖాతాల్లో రైతుబంధు జమైందని వివరించారు. రైతులని బద్నాం చేసు కుట్ర జరుగుతుందని.. రైతులను దొంగల్లా చిత్రీకరించే కుట్రకు ప్రభుత్వం తెరలేపిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగం, ఐటీ ఉంటే రైతుబంధు కట్ అంటున్నాడని.. సీఎం రేవంత్ కట్టింగ్ సీఎం అయ్యారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేశారని.. మేడగడ్డకు పర్రెపడడం కాదు.. రేవంత్‌రెడ్డి బుర్రకి పర్రె పడ్డదని విమర్శించారు.

కోటిన్నర ఎకరాలకి నీళ్లు ఇవ్వాల్సి వస్తుంది కాబట్టే కాళేశ్వరాన్ని బాగు చేయడం లేదని ఆరోపించారు. ప్రేక్షక పాత్ర కాదు అన్యాయం జరిగితే కోట్లాడాలని పిలుపునిచ్చారు. చిట్టినాయుడు ఏం పీకలేడన్నారు. అతివిశ్వాసం.. చిన్నచిన్న తప్పిదాలతో అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయామని.. కేసీఆర్ దేశాన్ని శాసించే రోజులు మళ్లీ వస్తాయన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా.. కేసీఆర్ జపం చేస్తున్నారన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని సీఎం చెబుతున్నాడని.. పరిపాలన చేతకాక మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

# కులం పేరిట కుట్రలు

తరువాయి భాగం

ప్రజలను ప్రధాని మోడీ కోరారు. ఢిల్లీలో గ్రామీణ్ భారత్ మహోత్సవ్‌ను ప్రధాని ప్రారంభిస్తూ, తన ప్రభుత్వం 2014 నుంచి గ్రామీణ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించిందని, 2047 నాటికి వికసిత్ భారత్ కల సాఫల్యంలో గ్రామాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కాంగ్రెస్ నేత, లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని, ఇతర ఇండియా కూటమి నేతలను మోడీ పరోక్షంగా ప్రస్తావిస్తూ, కొందరు వ్యక్తులు కులం పేరిట సమాజంలో విషం వెదజల్లుతున్నారని, సాంఘిక వ్యవస్థను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. 'అటువంటి కుట్రలను మనం భగ్నం చేసి, మన గ్రామాల ఉమ్మడి వారసత్వ సంపదను పరిరక్షించి, పటిష్ఠం చేయవలసి ఉంటుంది' అని ఆయన నొక్కి చెప్పారు.

రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ సహా ప్రతిపక్ష నేతలు అదే పనిగా కుల గణనను కోరుతున్నారు. 2014 నుంచి తాను గ్రామీణ భారత సేవలో ఉన్నానని మోడీ తెలియజేశారు. 'గ్రామీణ భారత ప్రజలకు గౌరవప్రద జీవితం లభించేలా చూడడం నా ప్రభుత్వ ప్రాథమ్యం' అని ప్రధాని చెప్పారు. సాధికార గ్రామీణ భారతం, గ్రామస్థులకు పుష్కలంగా అవకాశాల కల్పన. వలసల తగ్గింపు, గ్రామాల ప్రజలకు జీవన సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ లక్షం అని ఆయన తెలిపారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు పథకాల గురించి మోడీ మాట్లాడుతూ, మరుగుదొడ్లను స్వచ్ఛ భారత మిషన్‌లో భాగం చేసినట్లు. పిఎం ఆవాస్ యోజనలో భాగంగా గ్రామీణ భారతంలో కోట్లాది మంది ప్రజలకు పక్కా ఇళ్లు సమకూర్చినట్లు తెలియజేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా సురక్షిత, తాగు నీటిని సరఫరా చేసినట్లు ఆయన చెప్పారు.

'ప్రస్తుతం ప్రలజకు 1.5 లక్షలకుపైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో ఆరోగ్య సేవ సదుపాయాలు కల్పిస్తున్నాం' అని ప్రధాని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు ఆర్థిక విధానాల సృష్టి ప్రాముఖ్యత గురించి ప్రధాని ప్రధానంగా ప్రస్తావించారు. 'మా ప్రభుత్వ ఉద్దేశాలు, విధానాలు, నిర్ణయాలు గ్రామీణ భారతానికి కొత్త శక్తితో సాధికారత కల్పిస్తున్నది' అని ఆయన చెప్పారు. పిఎం కిసాన్ సమ్మాన్ నిధిద్వారా రైతులు ఆర్థిక సహాయంగా సుమారు రూ. 3 లక్షల కోట్లు అందుకున్నారని ఆయన తెలిపారు. గడచిన పది సంవత్సరాల్లో వ్యవసాయ రుణాల మొత్తాన్ని మూడున్నర రెట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ఇప్పుడు పశుసంవర్థక, చేపల రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తున్నట్లు మోడీ చెప్పారు. ప్రభుత్వం గడచిన పది సంవత్సరాల్లో అనేక పంటలకు ఎంఎస్‌పిని పెంచుతూ వచ్చిందని కూడా ఆయన తెలియజేశారు. 'ఉద్దేశాలు పవిత్రమైనవి అయినప్పుడు ఫలితాలు సంతృప్తికరంగా ఉంటాయని కూడా ఆయన చెప్పారు.

ఇటీవల భారీ స్థాయిలో నిర్వహించిన ఒక సర్వే పలు ముఖ్య వాస్తవాలను వెల్లడించిందని ప్రధాని చెబుతూ, 2011లో పోలిస్తే గ్రామీణ భారతంలో వినియోగం సుమారు మూడింతలు అయిందని, ప్రజలు తమకు ఇష్టమైన వస్తువులపై మరింతగా వెచ్చిస్తున్నట్లు ఇది సూచిస్తోందని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి జనాభాలో అధిక సంఖ్యాకులు గ్రామాల్లో నివసిస్తుంటారని, వారిని పూర్వపు ప్రభుత్వాలు అలక్షంచేశాయని, ఇది గ్రామాల నుంచి వలసలకు, పేదరికం పెరుగుదలకు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం విస్తరణకు దారి తీసిందని ఆయన చెప్పారు. ప్రతిపక్షాలను మోడీ పరోక్షంగా అవహేళన చేస్తూ, కొందరు వ్యక్తులు దశాబ్దాల తరబడి పేదరికం నిర్మూలన నినాదాలు చేస్తున్నారని, కానీ దేశంఇప్పుడు పేదరికంలో అసలైన తగ్గుదలను చూస్తున్నదని చెప్పారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ,

ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన, పిఎం ముద్ర, పిఎంఎస్‌విఎ నిధి సహా 16 ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకులు సంతృప్తత కార్యక్రమం చేపట్టాయని తెలియజేశారు. 'వికసిత్ భారత్ 2047' కోసం 'స్థితిస్థాపక గ్రామీణ భారత్ నిర్మాణం' ధ్యేయంతో శనివారం నుంచి వచ్చే గురువారం (9) వరకు గ్రామీణ భారత్ మహోత్సవ్ 2025ను నిర్వహిస్తున్నారు.

# రైతుభరోసా.. ఎకరాకు రూ.12,000



తరువాయి భాగం

మేరకు నిర్ణయం తీసుకొని రైతులకు శుభవార్త వినిపిస్తున్నాం. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ ఎకరానికి రైతు భరోసా అందించాలని నిర్ణయం తీసుకున్నాం. గత ప్రభుత్వం రైతుబంధు రూ.10 వేలు ఇస్తే.. మేం ప్రజాపాలనలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 వేలు పెంచి అందరికీ రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. భూములున్న వారికి రైతుభరోసా వస్తుంది. తండాలు, గూడేల్లోని వ్యవసాయ రైతు కుటుంబాలకు భూమి లేకపోవడంతో శాపం కాగా.. వారిని ఆదుకోకపోవడం శాపం అవుతుంది. నేను, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనలకు వెళ్లినప్పుడు ఈవిషయాన్ని మా దృష్టికి తెచ్చారు. వారు మనలో భాగమేనని గుర్తించి.. భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ పథకానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంగా నామకరణం చేస్తున్నాం. చాలా ఏళ్లుగా రాష్ట్రంలో రేషన్‌కార్డుల సమస్య ఉంది. ఇప్పటివరకు కార్డులు లేని వారికి కొత్తగా ఇవ్వాలని నిర్ణయించాం. ఈ పథకాలు ఈనెల 26 నుంచి ప్రారంభమవుతాయి.

**కొండలు, గుట్టలు, వాణిజ్య భూములకు ఇవ్వం..**

రాళ్లూరప్పలు, కొండలు, గుట్టలు, స్థిరాస్తి వెంచర్లు, రహదారులు, నివాస, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు ఉపయోగించే భూములు, నాలా మార్పిడి చేసినవి, వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం సేకరించిన.. వ్యవసాయయోగ్యం కాని భూములకు రైతు భరోసా వర్తించదు. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా సమాచారం సేకరిస్తారు. గ్రామసభలు నిర్వహించి ప్రజలకు వివరిస్తారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు, స్థిరాస్తి భూములు, ప్రభుత్వం సేకరించిన భూములకు రైతుబంధు ఇచ్చారు. రెవెన్యూ రికార్డులు, ధరణిలో లోపాల వల్ల ఇది జరిగింది. రైతుభరోసాలో అలా జరగదు. అనర్హులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వివరాలు అందించాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగానే రైతుభరోసా కోసం సాయం రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచాం. భూమిలేని పేదలకు రూ.12 వేలు ఇస్తున్నాం. ఆదాయ వనరులు పెంచడం.. పేదలకు పంచడం, మా ప్రభుత్వ విధానం.. ఎంత వెసులుబాటుంటే అంత మేలు చేయాలన్నదే మా ఆలోచన. దీనిపై అనవసర వివాదాలకు తావివ్వొద్దు'' అని సీఎం పేర్కొన్నారు.

**588 కారుణ్య నియామకాలు**

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో 588 కారుణ్య నియామకాలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లలో పనిచేసే 588 మంది సిబ్బంది అనారోగ్య, ఇతర సమస్యలతో మరణించారు. వారి కుటుంబాలకు చెందినవారు ఉద్యోగాల కోసం కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆరేళ్లుగా కోరుతున్నారు. మంత్రి సీతక్క సాంకేతిక న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకొని నియామకాల కోసం విన్నవించగా... మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

**కార్పొరేషన్‌గా కొత్తగూడెం..**


కొత్తగూడెం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చేందుకు, ములుగు పంచాయతీని మున్సిపాలిటీగా చేసేందుకు మంత్రిమండలి అనుమతించింది. 2022 సెప్టెంబరులోనే రాష్ట్ర శాసనసభ ములుగును పురపాలికగా చేసేందుకు బిల్లును ఆమోదించినా.. దానికి గవర్నర్ ఆమోదం తెలపలేదు. స్థానిక ఎమ్మెల్యే సీతక్క గవర్నర్‌ను కలిసి చర్చించారు. బిల్లులో లోపాలను గవర్నర్ కార్యాలయం తెలపడంతో.. దానిని సవరించి కొత్త ప్రతిపాదనను మంత్రిమండలికి సమర్పించగా ఆమోదం లభించింది.

**కొత్త దరఖాస్తులు అక్కర్లేదు..**

రైతుల నుంచి ఎలాంటి దరఖాస్తు అవసరం లేకుండానే రైతు భరోసా చెల్లించాలని మంత్రివర్గం నిర్ణయించింది. వ్యవసాయ యోగ్యమైన భూమికే ఇవ్వాలని నిర్ణయించినందున మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు నగదు చెల్లింపు, రేషన్‌కార్డులతో పాటు డిండి ఎత్తిపోతల పథకానికి పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవాలన్న ప్రతిపాదనపై సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు తెలిసింది. అన్ని పంటలకు కలిపి సుమారు కోటి 30 లక్షల ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాల్సి వస్తుందని అధికారులు మంత్రివర్గం దృష్టికి తెచ్చినట్లు సమాచారం. ''ప్రతి రైతుకు భరోసా అందాల్సిందే. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు అవకాశం లేదు, అలాంటప్పుడు వ్యవసాయ యోగ్యమైన ప్రతి భూమికి ఇస్తామని నిర్ణయించడమే మేలు'' అని ఎక్కువ మంది మంత్రులు అభిప్రాయపడినట్లు తెలిసింది. ఎకరాకు పంటకు రూ.7,500 చొప్పున ఇస్తామని చెప్పి.. రూ.ఆరు వేల చొప్పున ఏడాదికి రూ.12వేలు ఇవ్వడంపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. చివరకు ఆర్థిక పరిస్థితి, మిగిలిన పథకాలు, రుణమాఫీ, బోనస్ అమలు ఇలా అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకొన్నట్లు తెలిసింది.

**మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు**

హైదరాబాద్ తాగునీటి అవసరాలకు రెండు, మూడు దశలు కలిపి ఒకేసారి మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల గోదావరి నీటిని మళ్లించే పథకానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో హైదరాబాద్ తాగునీటికి 15 టీఎంసీలు వినియోగించుకోవడం, మూసీ పునరుజ్జీవంలో భాగంగా ఉస్మాన్‌సాగర్‌కు, హిమాయత్‌సాగర్‌కు ఐదు టీఎంసీలు మళ్లించడం, అత్యవసర సమయంలో ఇందులో కూడా రెండున్నర టీఎంసీలు తాగునీటికి వినియోగించుకొనేలా రూపొందించిన ఈ పథకానికి జలమండలి బోర్డు ఆమోదం తెలపగా, దీనికి మంత్రివర్గం ఆమోదం కూడా లభించింది.



# పోలవరంతో భద్రాచలానికి ముప్పు ఎంత?

తరువాయి భాగం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో నివేదిక తయారు చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నెల రోజుల్లో సమగ్ర నివేదిక తయారు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఇవాళ ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఐఐటీ హైదరాబాద్ టీంతో సమన్వయం కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. 2022లో 27 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినప్పుడు భద్రాచలం ముంపునకు గురైనట్లు సీఎంకు నీటిపారుదలశాఖ అధికారులు వివరించారు. ఈ మేరకు పోలవరం నిర్మాణంతో భద్రాచలం దేవాలయానికి ఏర్పడే ముప్పుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన గోదావరి బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని కూడా అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్టుపై ఇటీవల ఏపీ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని తెలిపారు. వరద జలాల ఆధారంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని సీఎంకు రేవంత్‌రెడ్డికి అధికారులు చెప్పారు.

**బనకచర్లను అడ్డుకోవాలి..**

బనకచర్లపై ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలంగాణ అభ్యంతరాలను తెలపాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుతో పాటు కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖకు లేఖలు రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు. సమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ పాల్గొన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు పోలవరం, అమరావతి నిర్మాణ పనులపై దృష్టి పెట్టారు. ఈ మేరకు ఆగస్టు 2024లో పోలవరం, అమరావతి నిర్మాణ పనులు వేగంగా సాగేందుకు సహకారం అందించాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరారు. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణపై పడే ప్రభావంపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు.

# అమ్మాయిల వాష్ రూమ్‌లో.. సీక్రెట్‌గా వీడియో షూటింగ్

తరువాయి భాగం

పోలీసులు నిందితుడిని గుర్తించారు. వీడియో తీసిన వ్యక్తిని అదే కాలేజీలో చదువుతున్న థర్డ్ ఇయర్ విద్యార్థి సిద్ధార్థ్‌గా గుర్తించారు. బ్యాక్ లాగ్ రాసేందుకు వచ్చిన సమయంలో వాష్‌రూంలో మొబైల్ కెమెరా పెట్టినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి పోలీసులు వీడియోను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థుల స్టేట్‌మెంట్ రికార్డ్‌ను పోలీసులు రికార్డ్ చేశారు.

**మల్లారెడ్డి కాలేజీపై సర్కారు సీరియస్..**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి చెందిన సీఎంఆర్ కాలేజీపై తెలంగాణ సర్కార్ సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. గర్ల్స్ హాస్టల్ బాత్రూంలో సీక్రెట్ కెమెరాలు ఉన్నాయని ఇటీవల స్టూడెంట్స్ ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. అయితే.. ఈ ఘటనపై అధికారుల ప్రాథమిక విచారణలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. హాస్టల్ నిర్వహణ సరిగా లేదని గుర్తించినట్లు తెలుస్తోంది. సీక్రెట్ కెమెరాల వ్యవహారంలో పోలీసులు ఇప్పటికే ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే.. ఈ ఘటనపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా మల్లారెడ్డి కాలేజీపై యాక్షన్ తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అవసరం అయితే కాలేజీని సీజ్ చేసే అవకాశం కూడా ఉందన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం మల్లారెడ్డి కాలేజీని పోలీసుల ఆదేశాలతో మూడు రోజుల పాటు క్లోజ్ చేసింది యాజమాన్యం. సోమవారం కాలేజీ తిరిగి తెరుచుకోనుంది. కాలేజీ తెరిచిన తర్వాత మళ్లీ ఆందోళనలు చేస్తామని విద్యార్థులు, స్టూడెంట్స్ యూనియన్ లీడర్లు హెచ్చరిస్తున్నారు. దీంతో సోమవారం ఏం జరగనుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

# ఎమ్మెల్యే క్వార్టర్స్ ఖాళీ చేయాల్సిందే

- కరెంటు, నీటి సరఫరా నిలిపివేస్తాం
- ఆదర్శనగర్‌లో ఉంటున్న వారికి నోటీసులు
- కాన్‌స్టిట్యూషన్ క్లబ్ నిర్మాణం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ప్రజాప్రతినిధులకు తెలంగాణ అసెంబ్లీ అధికారులు నోటీసులు ఇచ్చారు. క్వార్టర్స్ ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు హైదర్‌గూడలోని కొత్త క్వార్టర్స్ కేటాయిస్తామని అధికారులు వెల్లడించారు. ఇప్పుడున్న క్వార్టర్స్ ప్రాంతంలో కాన్‌స్టిట్యూషనల్ క్లబ్ నిర్మించబోతున్నట్లు, అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీ అంజనీ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ సహా అన్ని క్వార్టర్స్‌కు నోటీసులు ఇచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు క్వార్టర్స్‌లో ఉన్న పలు షాపులకు సైతం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆదర్శ్‌నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నాలుగెకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో కాన్‌స్టిట్యూషన్ క్లబ్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఢిల్లీ, రాజస్థాన్‌లో ఈ క్లబ్‌లు ఉన్నాయి. అదే తరహాలో ఇక్కడ నిర్మించనున్నారు.




విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
05.01.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## రైతుభరోసా రూ.15వేలు ఇవ్వాల్సిందే..

**మొదటిపేజీ తరువాయి:** మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కోత లేకుండా పూర్తిస్థాయిలో రైతు భరోసా చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుందని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. ''ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో రైతులకు ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని సీఎం రేవంత్ ప్రకటించడం దారుణం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలకు, ఇప్పుడు సీఎం చేసిన ప్రకటనకు పొంతనే లేదు. అన్నదాతలకు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుభరోసా సొమ్ము ఇవ్వాలని భాజపా పక్షాన డిమాండ్ చేస్తున్నాం. లేని పక్షంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో త్వరలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తాం'' అని బండి సంజయ్ హెచ్చరించారు.




# ఘనంగా డా. హనుమాండ్ల రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు









- ఉత్సాహంగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు
- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ
- అనాథాశ్రమంలో చిన్నారులతో కలిసి కేక్ కటింగ్
- పాలకుర్తి సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు
- రాజేందర్ రెడ్డికి వెల్లువెత్తిన శుభాకాంక్షలు

విశాలభారతి, పాలకుర్తి

పాలకుర్తి నియోజకవర్గంలో విద్య, వైద్యం సామాజిక అంశాల వారీగా దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్ హనుమాండ్ల రాజేందర్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు శనివారం నాడు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహాయం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులను కలిసిన కాంగ్రెస్ నాయకులు గజమాల, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ బ్లాక్ అధ్యక్షులు జాటోత్ హమ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, మండల పార్టీ ఉపాధ్యక్షులు భూక్యా సమ్మయ్య, మండల పార్టీ నాయకులు రెంటల గోవర్ధన్ రెడ్డి, మద్దెల వెంకన్న, మాదారపు అశోక్, కాంచనపల్లి వనజరాణి, సారంగం, పీరాని ప్రవీణ్, శ్రీను, దేదావత్ రామ నాయక్, నరసింహుల రామ్మూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

డా, హనుమండ్ల రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి దంపతులు. ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వారి బంధుమిత్రులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాక స్వామివారికి అభిషేకం, ఆరాధన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. మా మామయ్య డా, రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ఈ ఆలయం పాలకుర్తి ప్రాంతంలో ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. భక్తులు ఇక్కడకు విచ్చేసి స్వామివారి ఆశీర్వాదాలను పొందడం తాము సంతోషంగా చూస్తామని అన్నారు. ఆలయ అభివృద్ధి, అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం తాను ప్రత్యేక శ్రద్ధ చూపుతానని హామీ ఇచ్చారు, దేవాలయ ప్రాంగణం పునరుద్ధరణకు ప్రభుత్వ సహాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు, ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం, ఆలయంతో పాటు ప్రాంతీయ అభివృద్ధి కార్యకలాపాలను ముందుకు తీసుకువెళ్లాలని తన సంకల్పాన్ని ప్రకటించారు. అలాగే ఆలయ అర్చకులు, అధికారులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. స్వామివారి సేవలో భాగస్వామ్యం కావడం అదృష్టమని, వారి అభివృద్ధి పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ చూపడం ఆలయానికి గౌరవమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో పాటు సందడి వాతావరణాన్ని కలిగించింది.

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు..

పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డా, హనుమండ్ల రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, డా. రాజేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. డా, హనుమండ్ల రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆయన వ్యక్తిగత జీవితంలో, రాజకీయ జీవనంలో మరింత విజయాలను సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డా, రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాల వల్లనే నేను ఈ స్థాయికి చేరుకున్నానని.. నా జీవితంలో మీకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పటికీ కృషి చేస్తానని.. మీ ప్రేమ నా కుటుంబానికి స్ఫూర్తి అని అన్నారు. ఈ వేడుకలో నియోజకవర్గ నాయకులు, వివిధ గ్రామ ప్రజలు, శ్రేయోభిలాషులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

### తొర్రూర్ పట్టణంలోని స్నేహ నివాసంలో..

తొర్రూర్ పట్టణంలోని స్నేహ నివాసం అనాథ చిన్నారుల ఆశ్రమంలో డాక్టర్ హనుమాడ్ల రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎంతో ఆత్మీయంగా, ఆనందభరితంగా జరిగాయి. పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రాజరామ్మోహన్ రెడ్డి దంపతులు, ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు ఈ వేడుకలో పాల్గొన్నారు. డాక్టర్ రాజేందర్ రెడ్డి స్నేహ నివాసంలోని చిన్నారులతో కలిసి పెద్ద కేక్ కట్ చేసి, వారి ఆనందాన్ని పంచుకున్నారు. పిల్లలు పాడిన పాటలు, అందించిన శుభాకాంక్షలు వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకువచ్చాయి. ఆశ్రమంలోని చిన్నారులు, సిబ్బందికి ప్రత్యేక ఆహారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డా, రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి వేడుకలు చిన్నారుల సంతోషానికి దోహదపడటమే కాకుండా, వారికీ జీవితంపై విశ్వాసం కలిగిస్తాయన్నారు. ఈ సంతోషాన్ని మీ అందరితో పంచుకోవడం నా గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. ఈ వేడుకల ద్వారా పిల్లల జీవితాల్లో చిరునవ్వులు చూస్తున్నామని, స్నేహ నివాసం అభివృద్ధికి తన పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. స్నేహ నివాసం వారు పిల్లలకు సౌసాచాలం కావాలని అడగగా వెంటనే స్పందించి హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ట్రస్ట్ ద్వారా కట్టిస్తామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### చెర్లపాలెం పాఠశాలలో వేడుకలు..

డా, హనుమండ్ల రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, తొర్రూరు మండలం చెర్లపాలెం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, ఝాన్సీ డా. రాజేందర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, పాఠశాలలో విద్యా రంగంలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి నగదు బహుమతులు అందించారు. ఈ ప్రోత్సాహం విద్యార్థుల్లో మరింత ఆసక్తి, పట్టుదలను పెంచేలా మారింది. ఈ సందర్భంగా డా, రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్య ప్రాధాన్యతను అవగాహన చేస్తూ, విద్యార్థుల అభ్యున్నతి కోసం ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలను నిర్వహించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ పూర్తి సహాయాన్ని అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. చెర్లపాలెం పాఠశాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామస్తులందరూ విద్యకు ప్రాముఖ్యత ఇవ్వాలని, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధిలో విద్యకు మించి మరో సాధనం లేదని గుర్తు చేశారు. పాఠశాల విద్యార్థులు తాము సాధించిన విజయాలను కుటుంబ సభ్యుల, గ్రామస్థుల సమక్షంలో ప్రదర్శించారు. విద్యార్థులకు బహుమతుల రూపంలో డా, రాజేందర్ రెడ్డి వారికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. గ్రామ పెద్దలు, గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమం గ్రామంలో విద్యకు ప్రాధాన్యతనిచ్చే ఒక శుభ ప్రారంభంగా నిలిచింది. డా. రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని ఇలాంటి మంచి కార్యక్రమాలతో జరుపుకోవడం గ్రామస్తులకు స్ఫూర్తినిచ్చింది.

### తొర్రూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ..

తొర్రూరు పట్టణంలోని హనుమండ్ల పాపిరెడ్డి జ్ఞాపకార్థంగా నిర్మించిన ప్రభుత్వ హాస్పిటల్‌లో పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రాజా రామ్మోహన్ రెడ్డి దంపతులు, డాక్టర్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. డాక్టర్ రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. హాస్పిటల్‌లోని రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోగికి పండ్లతో కూడిన ప్యాకెట్లు అందజేశారు, ఇది రోగులకు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచే ప్రయత్నంగా మారింది. రోగులతో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం ముఖ్యమైనదని తెలిపారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగుల కోసం చిన్న సహాయం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నామని, ఆరోగ్య పరిరక్షణకు మరింత సేవలను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా డా, రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మా కుటుంబానికి ఈ హాస్పిటల్ ఒక స్మారక చిహ్నమని, రోగుల ఆరోగ్యానికి సాయం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇలాంటి కార్యక్రమాలను సమాజానికి మరింత చేర్చడానికి సిద్ధంగా ఉంటానని అన్నారు. హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, రోగులు ఈ సేవా కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు, నియోజకవర్గ నాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్టాండ్‌లో కేక్ కటింగ్..

డాక్టర్ హనుమాన్ల రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా తొర్రూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేక కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాలు, నీటి సమస్యలను గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని నేడు వారి మామయ్య డా రాజేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా వెంటనే వీటి పరిష్కారం కోసం రూ. 1 లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ చర్య ప్రజలకు సహకారం అందించడంలో గొప్ప ఉదాహరణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.








విశాల భారతి Real Talk
# రియల్ టాక్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily





హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో రీజినల్ రింగ్ రోడ్ కీలకంగా మారనుంది. మెరుగైన రవాణా సదుపాయాలతో పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాలకు పుష్కళమైన అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ నగరం చుట్టూరా ఉన్న జిల్లాలతో కనెక్టవిటీ పెరగడంతో... రియల్ ఎస్టేట్ రంగానికి అనువైన భూముల లభ్యత మరింత పెరగనుంది. అదే విధంగా ట్రిపులార్ వెళ్తున్న మార్గాలన్నీ భవిష్యత్తులో పారిశ్రామిక వాడలుగా ఎదగనున్నాయి. ఈ మార్గం వెంబడి అభివృద్ధిని అవసరమైన ప్రణాళికలను పకడ్బంధీగా అమలు చేయగలిగితే... భవిష్యత్ మొత్తం ట్రిపులార్ చుట్టురానే కేంద్రీకృతం కానుంది. అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో హైదరాబాద్ నగరానికి ట్రిపులార్ ఒక గేమ్ ఛేంజర్ కానుంది. అయితే ఇందులో భవిష్యత్ అవసరాలతోపాటు, ప్రస్తుతం మెరుగైన మౌలిక వసతులు కలిగిన ప్రాంతాలను అన్వేషించడమే ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు వెంబడి ఉండే పరిసర ప్రాంతాలన్నీ విప్లవాత్మక మార్పునకు వేదికలుగా సిద్ధం కానున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ కేవలం రహదారి మార్గం మాత్రమే కాకుండా హైదరాబాద్, సమీప జిల్లాలు, తెలంగాణ భవిష్యత్తును, ప్రత్యేకంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత బలోపేతం చేయనుండగా రీజనల్ రింగు రోడ్డు ప్రాజెక్టుపై విశాలభారతి రియల్ టాక్ ప్రత్యేక కథనం.

# రియాల్టీ గేమ్ ఛేంజర్...
# ట్రిపులార్

## మారనున్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ స్వరూపం
## రీజనల్ రింగు రోడ్డుతో సరికొత్త అవకాశాలు
## జిల్లాలకు విస్తరించనున్న హైదరాబాద్ ఆర్థిక వృద్ధి

విశాలభారతి, హైదరాబాద్ :

### హైదరాబాద్ రియాల్టీకి బూస్టప్...

గతంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంతో హైదరాబాద్ శివారులో భూముల ధరలు ఊహించని స్థాయిలో పెరిగాయి. దీంతోపాటు ఓఆర్ఆర్ ప్రాంతాలన్నీ కూడా రెసిడెన్షియల్, కమర్షియల్ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందాయి. అదే తరహాలో కొత్తగా రానున్న ఆర్ఆర్ఆర్‌తో ఈ ట్రెండ్ మరింత వేగంగా సరికొత్త ప్రాంతాలకు విస్తరిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది నగరంతోపాటు, నగర శివారులు, నగరానికి సమీపంలో ఉండే సరిహద్దు జిల్లాలను కూడా ప్రభావితం చేయనుంది. ప్రస్తుతం ఐటీ, ఫార్మాస్యూటికల్ రంగాల్లో హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్త స్థాయిలో గుర్తింపు ఉంది. కరోనా సమయంలో అంతర్జాతీయ స్థాయిలో ఫార్మా ఎగుమతులను చేసే స్థాయికి చేరింది. అత్యంత ధృఢమైన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ తో ఈ రంగం మరింత అభివృద్ధి చెందనుంది. అదే సమయంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు అనువైన పారిశ్రామిక వాడలతో స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రెండింతలు కానున్నాయి. దీంతో జీవన ప్రమాణాలు మెరుగుపడితే పరోక్షంగా పెట్టుబడులన్నీ కూడా రియల్ ఎస్టేట్ రంగంలోకి రానున్నాయి. ప్రధానంగా ట్రిపులార్ అనుసంధానంతో హైదరాబాద్, ఇతర జిల్లాల మధ్య సమర్థవంతమైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తోంది. దీంతోపాటు కొత్తగా గ్రోత్ కారిడార్లకు అవకాశం ఏర్పడుతుంది. అదేవిధంగా రియల్ ఎస్టేట్ రంగంలో హాట్‌స్పాట్‌గా మారిన నగరం మరింత బలోపేతం కానుంది.



### ట్రిపులార్... అవకాశాల కొలువు

340 కిలోమీటర్ల పొడవైన ట్రిపులార్ పలు జిల్లాలను హైదరాబాద్‌తో కలుపుతూ కీలకమైన అనుసంధానకర్తగా మారనుంది. ప్రధాన రహదారులు, పట్టణాలు, పారిశ్రామిక కేంద్రాలకు ఇది వారధిగా నిలవనుంది. శంకర్‌పల్లి, యాచారం, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో నివాస, వాణిజ్య ఆస్తులకు డిమాండ్ పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది. అదేవిధంగా మెరుగైన కనెక్టివిటీతో గేటెడ్ కమ్యూనిటీలు, అభివృద్ధి చెందిన ప్లాట్లు, గ్రామాలన్నీ కూడా ఆధునాతన పట్టణాలుగా ఎదిగేందుకు మార్గం సుగమం చేస్తోంది. దీంతో ఆయా ప్రాంతాలలో వాణిజ్య, వ్యాపార, ఉద్యోగ అవకాశాలతో నిండిపోనున్నాయి. అదే సమయంలో వ్యవసాయ రంగంలోనూ విప్లవాత్మక మార్పులకు అవకాశం ఉంటుందని, మెకనైజ్డ్ అగ్రికల్చర్ పెరిగి, వ్యవసాయ నిర్వహణ ఖర్చుల భారం మరింత తగ్గనుంది. దీంతోపాటు భూముల ధరలు వచ్చే ఐదారేళ్లలో క్రమానుగతంగా పెరిగేందుకు ట్రిపులార్ ఒక రాజమార్గం కానుంది.

### పారిశ్రామిక రంగంలో వృద్ధి

రీజనల్ రింగు రోడ్డు గణనీయమైన పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. నిర్మాణం తర్వాత పెరిగే మౌలిక వసతులతో పరిసర ప్రాంతాలలో పరిశ్రమలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, హాస్పిటాలిటీ రంగాల్లో పెట్టుబడులు ఊపందుకుంటాయి. ఈ పెరుగుదల భూముల ధరలను ప్రభావితం చేయనున్నాయి. దీంతో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జోరందుకుంటాయి. ప్రస్తుతం ఉన్న ఓఆర్ఆర్ నుంచి ట్రిపులార్ మధ్య ఉండే ప్రాంతాలను శాటిలైట్ టౌన్ షిప్‌లకు అనువుగా డెవలప్ చేసే ప్రణాళికలు ఉండటంతో ఆ ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయి. ఈ ప్రభావం క్రమంగా కోర్ సిటీ నుంచి ఔటర్ రింగ్ రోడ్ మధ్య ఉన్న ప్రాంతాలకు విస్తరించి, అభివృద్ధికి ట్రిపులార్ ఉత్ప్రేరకంగా నిలుస్తుంది. ఓఆర్ఆర్ నుంచి ట్రిపులార్ మధ్య కొత్తగా అందుబాటులోకి వచ్చే సెమీ అర్బన్ రీజియన్‌తో ప్రధానంగా రియల్ ఎస్టేట్ రంగంలో వృద్ధి ఊహించని స్థాయిలో పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ జోన్ పరిధిలో తయారీ, నగరకేంద్రీకృత వ్యవసాయం ఇతర యాడ్‌ఆన్ జోన్‌ల కోసం క్లస్టర్‌లతో సమీపంలో ఉన్న టైర్ 2 నగరాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. ట్రిపులార్ కారణంగా మెరుగైన కనెక్టివిటీతో గ్లోబల్ ఆర్గనైజేషన్‌లకు అనువుగా తయారీ కేంద్రాల వేదికలుగా నిలుస్తాయి. ఇప్పటికే ప్రభుత్వం ట్రిపులార్ దాటిన తర్వాత వచ్చే గ్రామాలు, పట్టణాలను మోడల్ రూరల్ రీజియన్లుగా తీర్చిదిద్దేలా సమాలోచనలు చేస్తోంది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్, మౌలిక వసతులు, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయి.



#### మెరుగైన లాజిస్టిక్స్ మరియు రవాణా

ట్రిపులార్ ద్వారా వేగవంతమైన, సులభతరమైన లాజిస్టిక్స్, రవాణా సేవలు పొందే వీలు ఉంటుంది. దీంతో రవాణా పరిశ్రమలు, గిడ్డంగులు, టెక్ పార్కులకు అనువుగా మారనుంది. ఓఆర్ఆర్ నుంచి ట్రిపులార్ మధ్య ఉన్న ఉండే ల్యాండ్ బ్యాంక్ భవిష్యత్తులో హాట్ కేకులా మారి, విశాలమైన వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా మారనుంది. దీంతో కొత్త వ్యాపారాలు మరింత సులభంగా ఏర్పాటు చేసుకునే అవకాశం స్థానికులతోపాటు, పెట్టుబడిదారులకు దొరుకుతుంది. ఈ కారణంగా ట్రిపులార్ వెళ్తున్న గ్రామాల నుంచి మండల కేంద్రాల వరకు భూముల ధరలు ఒక్కసారిగా పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

### సుస్థిరమైన విధానాలతో... మరింత పదిలం

పర్యావరణ సుస్థిరత అనేది ట్రిపులార్ ప్రాజెక్ట్‌లో కీలకమైన అంశం. చెట్ల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ, కర్బన రహిత ఇంధన వనరుల వినియోగం వంటి విప్లవాత్మక మార్పులను ప్రోత్సహించడం వలన సుస్థిరమైన పర్యావరణం అభివృద్ధిలో అంతర్భాగంగా మారుతుంది. రియల్ ఎస్టేట్ డెవలపర్‌లు ఇప్పటికే తమ ప్రాజెక్ట్‌లను కూడా సుస్థిరమైన పర్యావరణ ప్రామాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే ప్రభుత్వ విధానాలను పకడ్బంధీగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. దీంతో కొత్తగా అందుబాటులోకి వచ్చే రీజనల్ రింగు రోడ్డుకు ఇరువైపులా దాదాపు 5 కిలోమీటర్ల మేర ప్రణాళికబద్ధమైన పచ్చదనం, పర్యావరణ అనుకూలమైన డిజైన్లకు ప్రాధాన్యత ఇవ్వడం వలన... ఈ ప్రాంతంలో పర్యావరణం మరికొన్ని ఏండ్ల పాటు పదిలమై ఉంటుంది.

### ట్రిపులార్ ప్రాజెక్టులో ముఖ్యమైన ప్రాంతాలు...

దశలవారీగా అభివృద్ధి చేసే ట్రిపులార్ ప్రాజెక్టులో... ఈ ప్రాంతాలు ముఖ్యమైన కేంద్రాలుగా మారనున్నాయి. ఇందులో నార్త్ రీజియన్‌లోని సంగారెడ్డి, గజ్వేల్, భువనగిరి రూట్లలో పరిసర ప్రాంతాలలో భూమికి విపరీతమైన డిమాండ్ పెరగనుంది. ఇందులో... చౌటుప్పల్, పోచంపల్లి, భువనగిరి, బీబీనగర్, జగదేవ్‌పూర్, తుర్కపల్లి, వర్గల్, నాచారం, బొంతపల్లి, ఎల్దుర్తి, జోగిపేట వంటి ప్రాంతాలు కీలకంగా మారనున్నాయి. అదేవిధంగా సౌత్ రీజియన్‌లో వచ్చే శంకర్‌పల్లి, చేవెళ్ల, షాద్‌నగర్, మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, మాల్, ఇబ్రహీంపట్నం, మర్రిగూడెం వరకు వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక లావాదేవీలకు అనువుగా మారనున్నాయి.



### కళ్ల ముందరే భవిష్యత్...

రీజినల్ రింగ్ రోడ్ హైదరాబాద్ భవిష్యత్‌ను నిర్మించే వేదికగా మారింది. ఈ క్రమంలో కళ్ల ముందరే నిర్మితం కానున్న కొత్త నగరాన్ని మరింత పకడ్బంధీగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టును కేవలం మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా చూడటం కంటే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని పరివర్తన చేసే అవకాశంగా చూడాల్సి ఉంటుంది. జిల్లాల అనుసంధానం, పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన ప్రోత్సాహకాలు, రియల్ ఎస్టేట్ అవకాశాలు ఏర్పడే ఈ ప్రాంతంలో స్థిరమైన వృద్ధిని పెంపొందించాల్సి ఉంటుంది. భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే ఆర్థిక కేంద్రానికి బలమైన పునాదుల నిర్మాణం అత్యంత కీలకంగా మారనుంది. దీంతో హైదరాబాద్ అభివృద్ధి చెందుతున్నట్లుగానే నగర భవిష్యత్తును రూపొందించడంలో ట్రిపులార్ కీలక పాత్ర పోషిస్తుంది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
05.01.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## విజయవంతమైన ఉచిత కంటి ఆపరేషన్లు

**మణుగూరు, విశాలభారతి:**

మండలంలోని రామానుజ వరం పంచాయతీ పరిధిలో మణుగూరు ఏరియా సింగరేణి సంస్థ సహకారంతో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ సంజీవ్ రావు పర్యవేక్షణలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 38 మంది గ్రామస్థులకు కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తిచేసారు. వైద్య పరీక్షల అనంతరం, కంటి సమస్యలతో బాధపడుతున్న 38 మందికి సింగరేణి సంస్థ సహాయంతో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించి, కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం లబ్ధిదారులు ఎంతో సంతృప్తిగా, ఆనందంగా ఉన్నారు. కంటి చూపు మెరుగుపడటంతో వారి దైనందిన జీవితం మరింత సులభమైందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ పూర్తయిన అనంతరం వారికి అవసరమైన మందులు, ఐ డ్రాప్స్ మరియు తగిన సూచనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ప్రాంతానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కాంతారావు మరియు భద్రాచలం విద్యుత్ శాఖ అధికారి పాల్గొని, లబ్ధిదారులను కలుసుకున్నారు.

## వాహనాల తనిఖీ చేసిన ఎస్ఐ చదువాల తిరుపతి

**సైదాపూర్, విశాల భారతి**



సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామం వద్ద ఎస్ఐ చదువాల తిరుపతి వాహనాల తనిఖీ చేశారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ట్రెయిని ఎస్ఐ మనిషా,పోలీస్ సిబ్బంది శ్రీనివాస్,సురేష్,రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమనగల్లు కుచేసిన అభివృద్ధి ఏమిటి..

- **బిఆర్ఎస్ నాయకులు ప్రశ్నించిన బీజేపీ**

**ఆమనగల్లు, విశాలభారతి :**

గత పది ఏళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమనగల్లు కు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ఆమనగల్లు మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్ స్థానిక బిఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం 2లక్షల ఇండ్లను మంజూరు చేసిందని ఆ నిధులను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పక్కదారి పట్టించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకున్నారని ఆరోపించారు. నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలు బిసి బంధు, దళిత బంధు, గతంలో గులాబీ కార్యకర్తలకే దక్కయని అర్హులైన నిరుపేదలకు ఒక్క పథకం కూడా అంద లేదని ఆయన ఆరోపించారు. ఆమనగల్ పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చిన ఎందుకు కట్టించలేక పోయారని ప్రశ్నించారు. ఆమనగల్లు పట్టణంలోని చంద బావి నుండి తలకొండపల్లి మండల కేంద్రం వరకు డబల్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ. 37 కోట్లను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి మంజూరు చేయిస్తే... పనులను ఆమంగల్ నుండి కాకుండా తలకొండపల్లి నుంచి ప్రారంభించడం ఎంతవరకు సమంజసం అని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఆమనగల్లు బిఆర్ఎస్ నాయకులకు ఆమనగల్ ప్రజలపై ఉన్న ప్రేమ ఇదేనా అని ప్రశ్నించారు. అదేవిధంగా బీసీ కమిషన్ సభ్యులుగా ఉన్నప్పుడు ఆచారి అటల్ జళ్ నల్ పథకం ద్వారా ఆమనగల్లు మున్సిపాలిటీకి ఇంటింటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ .32 కోట్లు మంజూరు చేయించిన గతంలో ఎమ్మెల్యేగా ఉన్న జైపాల్ యాదవ్ ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి కేంద్ర



ప్రభుత్వం రూ .1750 కోట్లు మంజూరు చేసిందన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఆమనగల్లు కు ఏమి చేయలేక బిజెపిపై విమర్శలు చేయడం వారి అవివేకానికి నిదర్శమని శ్రీకాంత్ సింగ్ తెలిపారు. ఆమనగల్లు మండల కేంద్రంలో ప్రభుత్వ డివిజన్ కార్యాలయా ల ఏర్పాటు పదేళ్లలో అధికారం ఉన్న ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని బి ఆర్ ఎస్ నాయకులను శ్రీకాంత్ సింగ్ ప్రశ్నించారు. ఇక్కడి నుంచి తరలిపోయిన బీసీ హాస్టల్, డివిజన్ కార్యాలయాలు కూడా తిరిగి రప్పించలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేయించాలని అర్హులకు అన్యాయం చేయకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని కోరారు. బిఆర్ఎస్ నాయకులు ప్రజలను మభ్య పెట్టాలనే ఉద్దేశంతో మున్సిపాలిటీ కార్యాలయం ముందు ధర్నా చేస్తూ కొత్త డ్రామా కి తెర లేపారు అనీ ఆరోపించారు. వీరి మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని ప్రజలందరూ గమనిస్తున్నారని శ్రీకాంత్ అన్నారు. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేయించి అర్హులైన వారికి న్యాయం చేసి అధికారులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. శ్రీకాంత్ సింగ్ కోరారు.



## మల్లాపూర్ థీమ్ పార్క్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**నాచారం,విశాలభారతి:**

మల్లాపూర్ డివిజన్ పరిధిలో సుమారు నాలుగు కోట్ల రూపాయలతో అత్యాధునిక హంగులతో, ఆహ్లాదమైన థీమ్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే సంక్రాంతి పండుగ తరువాత థీమ్ పార్కును ప్రారంభించుకుందామని తెలిపారు. నియోజకవర్గంలో అత్యంత సుందరంగా తయారవుతున్న థీమ్ పార్క్ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజినీరింగ్ అధికారి ఏఈ శ్రవంతి, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, ఫైళ్ల ప్రవీణ్, పద్మరెడ్డి, దయాకర్ రెడ్డి, బుసాని రఘు, ప్రభాకర్ రెడ్డి, నర్సింగ్ రావు, శీలం ప్రవీణ్, రఘు, పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ కవితను కలిసిన రాష్ట్ర తాజా మాజీ సర్పంచ్లు

**ఆమనగల్లు, విశాలభారతి :**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, పలువురు సర్పంచులు ఎమ్మెల్సీని హైదరాబాదులోని వారి నివాసంలో శాలువాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తాజా మాజీ సర్పంచుల సమస్యలపై చర్చించారు. గ్రామ పంచాయతీలలో బిల్లులు అందక సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు సత్యనారాయణ, రాజిరెడ్డి, శారద,రమేష్ యాదవ్, యాదిరెడ్డి ,శ్రీను నాయక్, పెద్దపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన ఆమనగల్లు మార్కెట్ చైర్మన్

**ఆమనగల్లు, విశాల భారతి :**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదారాబాద్ లోని తమ నివాసంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నర్సింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమనగల్లు మార్కెట్ కమిటీని బలోపేతం చేయాలని సూచించారని, కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారానికి సిద్ధంగా ఉన్నాయనీ తెలిపారన్నారు. అర్హులైన ప్రజలందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలనీ అన్నారు. అదే విధంగా రాబోయే సర్పంచ్ లోకల్ బాడి ఎన్నికలలో కలిసికట్టుగా పనిచేసి అన్ని గ్రామ పంచాయతీలను క్లీన్ స్వీప్ చేయాడానికి కృషి చేయాలన్నారు.

## పది ఎకరాల్లోపు వారికే రైతు భరోసా ఇవ్వాలి

**కోదాడ, విశాలభారతి:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన రైతు భరోసా కార్యక్రమం ఈ జనవరి 14 నుంచి అమలు చేసే కార్యక్రమంలో భాగంగా 10 ఎకరాల్లోపు ఉన్న వారికే రైతు భరోసా ఇవ్వాలని మునగాల మండల పరిధిలోని నరసింహపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారులు డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డికి ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ బీడు భూములు, వందల ఎకరాల ఉన్న వారికి భూస్వాములకు, ఐటి చెల్లించే వారికి, శ్రీమంతులకు ఈ పథకం అమలు చేస్తే ఖజానాకు భారం పడుతుందని ఆయన అన్నారు. ఈ పథకాన్ని వారికి నిలిపివేసి నిరుపేదలకు, రైతు కూలీలకు వారి సంక్షేమానికి ఉపయోగించి వారిని ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులకు న్యాయం చేసే విధంగా ప్రత్యేకంగా వారి కోసం నిధులు కేటాయించాలని వివిధ కారణాల వల్ల రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని అన్నారు. వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ల పెంపుదల చేసి వారికి అండగా నిలవాలని, మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయల పథకాన్ని తక్షణమే అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని ఎక్స్ వేదికగా కోరినట్లు ఒక ప్రకటనలో సత్యనారాయణ తెలిపారు.



## ఏబీవీపీ కడ్తాల్ నగర నూతన కార్యవర్గం ఎన్నిక"

- **కడ్తాల్ నగర కార్యదర్శిగా నేనావత్ పవన్.**

**ఆమనగల్లు, విశాలభారతి :**



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కడ్తాల్ నగర నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈ కారిక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందాడి శ్రీరామ్ విచ్చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబీవీపీ 1949 జులై 9న ఢిల్లీ కేంద్రంగా ప్రారంభమై జాతీయవాద సిద్ధాంతంతో ఎంతోమంది విద్యార్థులను జ్ఞానశీల ఏకత సాధనలకై జాతీయ పునః నిర్మాణం కోసం పనిచేస్తున్న విద్యార్థి సంఘం అని చెప్పారు. విద్యారంగ సమస్యలను ఎత్తిచూపుతూ విద్యార్థుల గొంతుకగా మారి ఎన్నో ఉద్యమాలు నిర్వహించింది. నేటికీ 76 వసంతాలు పూర్తిచేసుకుని అతిపెద్ద విద్యార్థి సంఘంగా నేడు ప్రపంచవ్యాప్తంగా అవతరించింది. పాఠశాల స్థాయి నుండి యూనివర్సిటీ స్థాయి వరకు ప్రతి ఒక్క విద్యార్థిని జాతీయ భావ సిద్ధాంతాల వైపు నడిపిస్తూ దేశ హితం కోసం పనిచేస్తున్న విద్యార్థి సంఘం ఏబీవీపీ అని కొనియాడారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు క్యామ శ్రీకాంత్ మాట్లాడుతూ తరగతి గది నుంచి దేశ సమస్యల పైన నిరంతరం పోరాటం ఏబీవీపీ చేస్తుందని,ప్రతి నిత్యం విద్యారంగా సమస్యల పై పోరాటం చేస్తున్న ఏకైక సంస్థ ఏబీవీపీ అని అన్నారు. కడ్తాల్ నగర నూతన కార్యవర్గం నగర కార్యదర్శిగా నేనావత్ పవన్,ఉపాధ్యక్షులుగా ఉమేష్ ,నగర సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్ ,స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ కన్వినర్ గా అఖిల్ ,క్రీడా కన్వినర్ గా గణేష్ ,విద్యార్థి సేవ కన్వినర్ గా దశరథం,కార్యవర్గ సభ్యులుగా నరేందర్ ,సందీప్,పవన్ ,దిలీప్ ఎన్నికయ్యారు.






## కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- **భీమ్గల్ టీఎన్జీవో యూనిట్ సభ్యులు**

**బాల్కొండ, విశాల భారతి**

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును భీమ్గల్ టీఎన్జీవో యూనిట్ అధ్యక్షుడు కుంట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పురస్తు నరేష్ కలెక్టర్ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి,నోట్ బుక్స్ లను అందజేశారు.అనంతరం టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ ని జిల్లా కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు మణిక్యం, ఏడేల్లి రవి పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం

**రామగుండం, విశాలభారతి:**

ఆర్ఎఫ్ సియల్ టౌన్షిప్ సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాలతో స్మార్ట్ లివింగ్ ప్రోగాంలో భాగంగా బాలికా సంరక్షణ అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ప్ర) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి బాలిక విద్యతో పాటు క్రమశిక్షణ, స్వయం నియంత్రణ, విచక్షణా జ్ఞానం,మానసిక బలం, మంచి అలవాట్లు,ఆలోచనలు, దృఢ సంకల్పం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు వంటివి అలవరుచుకోవాలని అన్నారు. అదే విధంగా చిన్ననాటి నుండి సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో, దుష్టశక్తుల నుండి తమను తాము రక్షించుటకొరకై అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నెంబర్ 1930 ను సంప్రదించాలని తెలిపారు. లింగవివక్షను వీడి అందరు సమానమే అనే భావనతో మెలగాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్ రవి, ఉదయ్ కుమార్, డీన్ రమేష్, క్యాంపస్ ఇంచార్జ్ నరేంద్ర కుమార్, ప్రశాంతి, సౌజన్య, స్వర్ణలత విద్యార్థులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

ఆదివారం,
05.01.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



### మంచుతో కమ్మేసిన రహదారులు



**కోదాడ, విశాలభారతి:**

రహదారులు మంచుతో పూర్తిగా కమ్మేయడంతో వాహనదారులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకుండా మంచుతో కంపెయడంతో వాహనదారులు హెడ్లైట్లతో నిదానంగా ప్రయాణాలు కొనసాగించారు. కొంత మంది వాహనదారులు రహదారులపై ఇబ్బందులు పడి రోడ్డు పక్కన నిలిపేసిన సందర్భాలు ఉన్నాయి. ఉదయం 9 గంటలు దాటిన మంచుతో రహదారులు కమ్మేయటంతో ప్రయాణికులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురయ్యారు.



## జిల్లా కలెక్టర్ కు శుభాకాంక్షలు వెల్లువ

- జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసిన నాగభూషణం

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**

2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ కందుకూరి నాగభూషణం డీఆర్డిఓ ఆధ్వర్యంలో శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఉపాధి కూలీలకు సరైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి కూలీలకు ఉపాధిని చూపించాలన్నారు.ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కు పుస్తకాలను, పెన్స్, టవాల్స్ ను అందజేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీడీ చరణ్ గౌతమ్, ఎఫ్ఎం శారద, సూపర్డెంట్ ప్రసాద్, జేఏసి నాయకులు రవీందర్ రెడ్డి, వీరాసింగ్,లలిత, నర్సింహులు,తిరుపతి చారి, రవికుమార్,విమల,శివశంకర్ రెడ్డి, సంధ్య, కరుణ శ్రీ, వెంకట్ తదితరులున్నారు.

## పూలే జన్మదినాన్న ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం హర్షనీయం

- కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

**కూకట్ పల్లి,విశాలభారతి:**



మహిళా సాధికారత కోసం ప్రతి మహిళకు చదువుకోవాలని సావిత్రిబాయి పూలే మహిళల కోసం చేసిన త్యాగం మరువలేనిదని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు.సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతగా శనివారం బాలనగర్ లోని, శోభన బస్టాండ్ ఆవరణలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆయన చిత్రపటానికి ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మహిళలంటే చులకన భావం,గౌరవం లేని నాటి రోజుల్లోనే దళిత బహుజనులతో పాటు అగ్రవర్ణాల మహిళలకు సైతం విద్యను అందించడానికి కృషి చేసిన సావిత్రిబాయి పూలే నిజంగా దేశం గర్వించదగ్గ మహిళ అని కొనియాడారు. ఆమె పుట్టిన రోజున మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి బండి రమేష్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు,మహిళా ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు,మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్,టెంపుల్ కమిటీ మెంబర్స్ ,బ్లాక్ అద్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, NSUIనాయకులు, మైనారిటీ నాయకులు,ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ జిఓఎస్ క్యాలెండర్స్ విడుదల చేసిన ఓయూ వీసీ

**సికింద్రాబాద్, విశాలభారతి:**

ఓయూ ఎన్ జిఓఎస్ అసోసియేషన్ వారి న్యూఇయర్ క్యాలెండర్స్ ను శనివారం పరిపాలనా భవన్ సెనేట్ హాల్లో లోపు వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, రిజిస్ట్రార్ ప్రొ. గడ్డం నరేష్ రెడ్డి,ఓఎస్డీ జితేందర్ నాయక్ లు విడుదల చేశారు. వీసీ ఉద్యోగుల కు శుభాకాంక్షలు తెలియజేశారు. యూనివర్సిటీ అభివృద్ధి కి కలసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ సందర్భంగా వీసీ ప్రొ. కుమార్ మాట్లాడుతూ. నూతన సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ లో జరిగే మార్పులకు ఉద్యోగులందరు సహకరించాలని, కలిసి పనిచేయాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ కీర్తిని ఉన్నత విద్యారంగములో ముందుకు తీసుకొని పోవాలని కోరుతూ ఉద్యోగ సంఘాలను అభినందిస్తూ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమములో NGOs అసోసియేషన్ అధ్యక్షుడు బియ్యాన్ని. జ్ఞానేశ్వర్,నాగరాజు శివ శంకర్, అక్బర్ బైగ్, విజయకుమార్, భీమయ్య శంకరయ్య, రవి, అశోక్ కేతావత్ శంకర్ నాయక్, యూసఫ్, భూమరావు రాకేష్ , టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.



## అర్హులైన పేదలకు త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు

- కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి

**కూకట్ పల్లి,విశాలభారతి:**

ఇందిరమ్మ ఇళ్ల కోసం అధికారులు చేస్తున్న సర్వే పని తీరును కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలోని బోయిన్పల్లి డివిజన్ అబ్రహార్ నగర్లో ఆయన శనివారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి సర్వే జరుగుతున్న తీరుపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు.అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం జరుగుతుందని ఎవరు ఆందోళనకు గురి కావద్దని ఈ సందర్భంగా రమేష్ వారికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యాదగిరి, పుష్ప రెడ్డి , గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సతీష్ రెడ్డి, మల్లికార్జున్ యాదవ్, రాజేందర్, అస్లాం, అంజాద్, షహేన్షా ,గౌస్ ,మైఖేల్, తదితరులు పాల్గొన్నారు



## లక్ష తులసి అర్చన కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్

**కూకట్ పల్లి,విశాలభారతి:**

భరత్ నగర్ లోని శ్రీ హరిహరపుత్ర దేవాలయ ప్రాంగణంలోని శ్రీ సీతారామచంద్ర స్వాములవారికి శనివారం లక్ష తులసి అర్చన కార్యక్రమం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, పులి శ్రీకాంత్ గౌడ్, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్,టెంపుల్ కమిటీ మెంబర్స్ ,బ్లాక్ అద్యక్షులు,బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, sc సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు మరియు కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలి

- సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.చంద్రశేఖర్

**పటాన్ చెరు,విశాలభారతి**

సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు 1, 2 లలో డబల్ బెడ్ రూమ్ పట్టాలు పొందిన ఇండ్ల యజమానులు, సొసైటీ సభ్యులతో అన్ని శాఖల అధికారులతో జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తో కలిసి తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో అక్కడి సమస్యల గురించి, వసతుల గురించి పరిష్కార దిశగా సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పట్టా పొందిన లబ్ధిదారులందరూ ఐకమత్యంతో కుటుంబ సభ్యులు లాగా కలిసిమెలిసి ఉండాలని, సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. బేషజాలకు పోకుండా సానుకూల వాతావరణములో జీవనం కొనసాగించాలని, వారందరికీ దిశా నిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీ, మున్సిపల్ శాఖల నుండి మీకు అందవలసిన అన్ని వసతులను అతి త్వరలోనే కల్పించడం జరుగుతుందని తెలిపారు. సొసైటీలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోగానే షాపుల అలాట్మెంట్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఇంటి యజమానులందరూ కొన్ని సమస్యలు మీ స్థాయిలో పరిష్కరించుకుంటే అంతకు రెట్టింపు స్థాయిలో ప్రభుత్వం నుండి, అధికారుల నుండి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సమిష్టిగా అందరూ కృషి చేయాలని కోరారు. అక్కడి నుండి అన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం, ఇంటి నెంబర్ల కేటాయింపు, విద్యుత్తు, నీటి సౌకర్యం, డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య సమస్యలు, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, త్వరలోనే ఏర్పాటుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి ముందు జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ మున్సిపల్ సాధారణ నిధుల నుండి నిర్మింపబడుతున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను, బీటీ రోడ్, స్త్రీ శక్తి మహిళా క్యాంటీన్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయవలసిందిగా మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి సూచించారు. ఈ సమన్వయ సమావేశంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తహశీల్దార్ సంగ్రామ్ రెడ్డి, మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ, ఎఈఈ మౌనిక, సీడీపీఓ జయరాం నాయక్, ఆర్ఓ వెంకటరామయ్య, మేనేజర్ అఖిల్, జీహెచ్ఎంసీ ఏఈ సత్యనారాయణ, సైట్ ఇంజనీర్ ప్రణీత్, అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి, మున్సిపల్ సిబ్బంది, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.




## సమాజాన్ని తీర్చిదిద్దడంలో మహిళ ఉపాధ్యాయులది కీలక పాత్ర

- మహిళా ఉపాధ్యాయులకు సన్మానం
- ZPHS చైర్ పర్సన్ పెరుమాండ్ల లలితమ్మ ,MEO చాప్లా నాయక్

**తలకొండపల్లి ,విశాలభారతి:**

తలకొండపల్లి మండలకేంద్రంలోని ZPHS హైస్కూల్లో సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకొని అమ్మ ఆదర్శపాఠశాలస్కూల్ చైర్మన్ పెరుమాండ్ల లలితమ్మ, మరియు ఎంఈఓచాప్లనాయక్ అధ్యక్షతన జరిగిన మహిళా ఉపాధ్యాయలను సన్మానించారు.ఈ సందర్భంగా చైర్మన్ పెరుమాండ్ల లలితమ్మ మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయుల కృషిని గుర్తించి,గౌరస్తూ తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని జనవరి 3 చదువులతల్లి సావిత్రిబాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయదినోత్సవంగా ప్రకటించడం చాలా సంతోషకరమైన విషయంనికొనియాడారు.ఈసృష్టికి మూలంఒకమహిళనేకాబట్టి నేటి సమాజాన్ని తీర్చిదిద్దడంలో మహిళ ఉపాధ్యాయులపాత్ర ఎంతోకీలకమని పేర్కొన్నారు. ఒక ఇంటిని కానీ ఒక కుటుంబాన్ని కానీ దేశాన్ని కాని తీర్చిదిద్దే సత్తా ఒకమహిళ లోకానికి మాత్రమే ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో HM ఝాన్సీ, నుమరియు మహిళ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు

- ఎచ్ఐసిసి నోవాటల్ హోటల్ అట్టహాసంగా ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**



ఏపీ సీఎం చంద్రబాబుతో రిసా క్రియేషన్స్ ఫౌండర్స్ పూజ

ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు ఎచ్ఐసిసి నోవాటల్ హోటల్ లో అట్టహాసంగా ప్రారంభం అయ్యింది.శుకసాయంత్రం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు హాజరై మహాసభలను ఉద్దేశించి ప్రశంగించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను సందర్శించిన అయన రిసా క్రియేషన్స్ అనే స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో అయన సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ సారీస్,వేంకటగిరి పట్టు, చందేరి,బనారసి వీవర్స్ నుండి ప్రత్యేకంగా డిజైన్ చేసిన వాటి గురించి రిసా క్రియేషన్స్ ఫౌండర్ పూజను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ నుండి తెస్తున్నారు..వీవర్స్ ను సపోర్ట్ చేస్తున్నార అని అడగడంతో పాటు చిన్న వయసులో యంగ్ ఎంట్రప్రీన్యూర్ గా బిజినెస్ స్టార్ట్ చేయడం మంచి పరిణామం అని ఆనందం వ్యక్తం చేసి ఆమెను అభినందించారు.సీఎం సతీమణి నారా భువనేశ్వరి కూడా రిసా క్రియేషన్స్ స్టాల్ ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల సారీస్ గురించి అడిగి తెలుసుకున్నారు. తెలుగుదనం ఉట్టి పడేలా సారీస్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు.వీవర్స్ ను సపోర్ట్ చేసి వారికి ఉపాధి కల్పించడం గొప్ప సంకల్పమని ఆమె రిసా క్రియేషన్స్ ఫౌండర్ పూజను అభినందించారు.రిసా క్రియేషన్స్ ఇండియా లోనే కాకుండా విదేశాల్లో కూడా తమ సారీస్ లభిస్తాయని ఫౌండర్ పూజ తెలిపారు. దుబాయ్, అమెరికా లాంటి దేశాల్లో కూడా తమ బ్రాంచ్ లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## నూతన మార్కెట్ కమిటీకి అభినందనలు

- తీగల గిరిధర్ రెడ్డి

**శాలిగౌరారం,విశాలభారతి:**



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులై శనివారం ప్రమాణస్వీకారం చేసిన పాదురి శంకర్ రెడ్డి,వైస్ చైర్మన్ నరిగె నరసింహ పాలకవర్గంకు తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కల్సి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం కందాల సమరం రెడ్డి, జిల్లా నాయకులు ఇంతియాజ్ నూతనకల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్, తుంగతుర్తి నియోజకవర్గ యువజన నాయకులు మూడ్ మోహన్ నాయక్ ,మండల నాయకులు బండపల్లి మహేష్ ,,NSUI మండల కోర్డినేటర్ మరికంటి అశోక్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
05.01.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## పిసిసి లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### తెలియజేసిన బొడ్డు బిక్షం గౌడ్



తెలంగాణ హైకోర్టులో పిసిసి లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ను బొడ్డు బిక్షం గౌడ్ కలిసి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ సందర్భంగా సంవత్సరం అంతా మంచి జరగాలని మరిన్ని అత్యున్నత పదవులు పొంది అందరితో గౌరవించబడాలని తెలిపారు



## 'తుర్కయంజాల్‌ను అభివృద్ధిలో ముందుంచుతాం'

**తుర్కయంజాల్, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందుంచేందుకు కృషి చేస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో త్వరలో మరిన్ని నిధులు రానున్నాయని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. పురపాలిక పరిధి కోహెడ, బ్రాహ్మణపల్లిలో సుమారు రూ.2.41కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు చైర్ పర్సన్ అనురాధతో కలిసి రాంరెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే మున్సిపాలిటీకి మరిన్ని నిధులు రానున్నాయని ఆయన వెల్లడించారు. తుర్కయంజాల్‌ను అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరితాధన్‌రాజ్‌గౌడ్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, కౌన్సిలర్లు కంబాలపల్లి ధన్‌రాజ్, కొండ్రు మల్లేశ్, కాకుమాను సునీల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుంట గోపాల్‌రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, కొంతం వెంకటరెడ్డి (జానీ), మేతరి అనురాధ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.



## 'కార్మికుల సమస్యలపై సమ్మెకు సిద్ధం'

**తుర్కయంజాల్, విశాలభారతి:** మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ హెచ్చరించారు. తుర్కయంజాల్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి దీక్షకు దిగారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్‌లో జరుగుతున్న అవకతవకలను నివారించాలని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ 48గంటల దీక్షకు పూనుకున్నట్లు తెలిపారు. ఈనెల 6న కలెక్టరేట్ ముట్టడికి కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.సత్యనారాయణ, కార్మికులు శివ, కృష్ణ, మహేష్, వెంకటేష్, భాగ్యమ్మ, మంకమ్మ, ఎల్లమ్మ, అండాలు, లక్ష్మి, సులోచన, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

- అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగా రెడ్డి

**పటాన్ చెరు(అమీన్ పూర్),విశాలభారతి** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణల మూలంగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తోందని అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి అన్నారు. వి ఫర్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి, మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచిత భోజనం, యూనిఫామ్, పుస్తకాలు అందించడం జరుగుతుందని, ఈ సదవకాశాన్ని విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వి ఫర్ యు ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ,కల్పన ఉపేందర్ రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్,కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు చంద్ర శేఖర్, కొల్లూరు యాదగిరి, వి ఫర్ యు ఫౌండేషన్ అధ్యక్షులు వినోద్ కుమార్, సభ్యులు మల్లికార్జున్, ప్రవీణ్ కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## పెద్ద నాగారం స్టేజిని నూతన మండలంగా ప్రకటించాలి

**నర్సింహులపేట, విశాలభారతి:** మండల కేంద్రంలోని పెద్దనాగారం స్టేజిని నూతన మండలంగా ప్రకటించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కలెక్టర్ కు పెద్ద నాగారం పరిసర ప్రాంతాల ప్రజలు వినతి పత్రాన్ని అందజేశారు. పెద్ద నాగారం స్టేజ్ ని అనుసరిస్తూ సుమారు 15 గిరిజన తండాలు గ్రామపంచాయతీలుగా ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడానికి సరిపడా ప్రభుత్వం భూమి కూడా అందుబాటులో ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద నాగారం స్టేజి మాజీ సర్పంచ్ బొబ్బ సోమిరెడ్డి, సీనియర్ నాయకులు సప్పిడి వెంకట్ రెడ్డి, గాడిదల వెంకన్న, సీతారాం నాయక్, రఫీ, వినతి పత్రం అందజేశారు.





# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**పటాన్ చెరు,విశాలభారతి** సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఆయన చెప్పారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, డివిజన్లు, మున్సిపాలిటీలకు చెందిన 125 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన ఒక కోటి 25 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలో అరులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, పటాన్ చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తహసీల్దార్లు రంగారావు, రాధ, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సాహస్ స్కాలర్షిప్

**సికింద్రాబాద్,విశాలభారతి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీతాఫల్మండి విద్యార్థులకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సాహస్ స్కాలర్షిప్ ప్రోగ్రాం 2024 25 విద్యా సంవత్సరానికి, పదవ తరగతి ఇంటర్మీడియట్ లలో 75 శాతం మార్కులకు పైబడి ఉన్న 15 మంది విద్యార్థులకు అడ్మిషన్ ఫీ ఎగ్జామ్ ఫీ కొరకు 1,24,590 రూపాయలు సాహస్ స్కాలర్షిప్ ను విద్యార్థులకు ప్రిన్సిపాల్ డా.యం.రామ చంద్రం అందజేశారు.విద్యార్థులకు స్కాలర్షిప్స్ రావడానికి కృషిచేసిన సీతాఫల్మండి డిగ్రీ కళాశాల అధ్యాపకులు మరియు హిందీ ప్రొఫెసర్ డాక్టర్ అనుపమ సహకారం ప్రశంసించారు. స్కాలర్షిప్పులు పొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రామ్ చంద్రం,మరియు అధ్యాపకులు అభినందించారు.




## ఆదర్శ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరైన తొర్రూరు సివిల్ జడ్జ్ సరిత

**నరసింహులపేట, విశాలభారతి:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై తొర్రూరు సివిల్ జడ్జి సరిత మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా అనే భావంతో విద్యార్థులు పాఠ్యాంశాలోని విషయాలతో పాటు నేటి సమాజంలో జరిగే చట్టపరమైన విషయాలను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ చర్యలు కూడా ముఖ్యమని మోటార్ వెహికల్ యాక్ట్ చట్టం గురించి చెబుతూ మైనర్ అయిన విద్యార్థులు వాహనాలు నడపరాదని వివరించారు. సమాజంలో జరిగే బాలికలపై అత్యాచారాలను ఖండిస్తూ వాటి గురించి నీ బాల బాలికలకు న్యాయపరమైన విషయాలను తెలియపరిచారు. డ్రింక్ అండ్ డ్రైవ్ అంశంపై మాట్లాడుతూ విద్యార్థుల తమ బంధుమిత్రులు మరియు తల్లిదండ్రులు వాహనము నడిపేటప్పుడు మద్యం సేవించి నడపరాదని విద్యార్థులే వారి కుటుంబ సభ్యులకు మరియు ఇతరులకు తెలియజేయాలని న్యాయపరమైన విషయాలను విద్యార్థులు తమ చుట్టు ప్రక్కన జరిగే చట్టపరమైన విషయాలను తమ తల్లిదండ్రులతో పాటు రక్షణ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రక్షణ శాఖ అధికారి ఎం సురేష్, న్యాయవాది తలారి గౌస్, స్థానిక ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## మాదిగలంతా తరలిరావాలి

- మాదిగ కళ మండలి మండల కమిటీ ఎన్నిక

**అడ్డగూడూరు, విశాలభారతి:** మండల కేంద్రంలో ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షులు సూరారం రాజు మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫిబ్రవరి 7 నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు వేయి గొంతుల కార్యక్రమం విజయవంతం చేయుటకై మాదిగ కళామండలి మండల కమిటీ ఏర్పాటుకొరకు సూర్యాపేట మాదిగ కళ మండలి జిల్లా అధ్యక్షులు ఎర్ర అందీప్ మాదిగ తుంగతుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ చిప్పలపల్లి మల్లేష్ మాదిగ వంగూరి నరేష్ మాదిగ ఇంచార్జ్ లుగా హాజరై నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ మంద క్రిష్ణ మాదిగ తలపెట్టిన ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకై ప్రతి ఇంటినుండి మాదిగ బిడ్డ ఒక సైనికుడై తమ కళారుపాలను ప్రదర్శించుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరారు మండల అధ్యక్షుడిగా బాలెంల మల్లేష్ మాదిగ ఉపాధ్యక్షుడిగా మేకల తరుణ్ మాదిగ ప్రధాన కార్యదర్శిగా మందుల నవీన్ కుమార్ మాదిగ కార్యదర్శిగా బోడ యాదగిరి కోశాధికారిగా చిప్పలపల్లి తేజ సంయుక్త కార్యదర్శిగా ఊడుగు మల్లేష్ మాదిగ మిగతా కార్యవర్గ సభ్యులకు నియామక పత్రం అందజేయడం జరిగింది. బాలెంల మల్లేష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమం విజయవంతం కోసం నా వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ అధికార ప్రతినిధి పనుమటి సతీష్, మాదిగ ప్రధాన కార్యదర్శి బాలెంల నరేష్మాదిగ, ఉపాధ్యక్షులు మందుల జానీ మాదిగ, జిల్లా రాకేష్,సీనియర్ నాయకులు దర్శనలా సతీష్ మాదిగ ఎడ్ల వెంకటయ్య మాదిగ, బోనాల నరేందర్,గజ్జెల్లి కృష్ణ,చిప్పలపల్లి సుధాకర్ మాదిగ బుర్రు ప్రభాకర్ మాదిగ తీగల సైదులు ఊడుగు మారయ్య తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన అన్నదాన కార్యక్రమం

**అడవిదేవులపల్లి, విశాలభారతి:** మండల కేంద్రంలో శ్రీ దాస ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో మిర్యాలగూడ శాసనసభ్యులు భత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో మాల ధరించిన స్వాములందరికీ డిసెంబర్ 4వ తారీఖున అన్నదాన కార్యక్రమం మొదలుపెట్టి జనవరి 4వ తారీఖు వరకు 32 రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని శనివారం రోజున ముగించడం జరిగింది అనంతరం మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ మాట్లాడుతూ మాల ధరించిన స్వాములందరికీ ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమని అన్నారు అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు మాల ధరించిన స్వాములందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ బండి నాగేశ్వరరావు గురుస్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇట్టి కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగించాలని కోరుతూ శ్రీ ధర్మశాస్త్ర హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి వారి ఆశీస్సులు వారికి ఎల్లవేళలా ఉండాలని పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మాల ధరించిన స్వాములు మండల కాంగ్రెస్ నాయకులు బిఎల్ ఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
ఆదివారం,
05.01.2024
హైదరాబాద్



cinema updates



# 'దళపతి 69' సినిమా 'భగవంత్ కేసరి' రీమేక్ కాదు..

గతేడాది గోట్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' సినిమాతో హిట్ అందుకున్న తమిళ అగ్ర నటుడు దళపతి విజయ్ ప్రస్తుతం హెచ్. వినోద్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. దళపతి 69 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో పూజ హెగ్డే కథానాయికగా నటిస్తుండగా.. ప్రేమలు బ్యూటీ మమితా బైజు కీలక పాత్రలో నటించబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి గత కొన్ని రోజులుగా ఒక వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. టాలీవుడ్‌లో బ్లాక్ బస్టర్ అందుకున్న బాలకృష్ణ భగవంత్ కేసరి సినిమాను దళపతి 69 గా రీమేక్ చేస్తున్నట్లు.. ఇప్పటికే దీనికి సంబంధించిన తమిళం హక్కులను కూడా మేకర్స్ తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఈ వార్తలపై దర్శకుడు హెచ్.వినోద్ క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా భగవంత్ కేసరి రీమేక్ కాదని.. ఇది ఒక ఒరిజినల్ కథ అని.. విజయ్‌కి ఈ చిత్రం పక్కా మాస్ కమర్షియల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ అవుతుందని తెలిపాడు.ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ మూవీని నిర్మించనుంది. ఈ సినిమాను అక్టోబర్ 2025న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

# ఆసుపత్రిలో చేరిన కియారా అద్వానీ..?



బాలీవుడ్ నటి కియారా అద్వానీ అనారోగ్యం కారణంగా ముంబైలోని ఆసుపత్రిలో చేరినట్లు ఉదయం నుంచి వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను ఆమె ప్రతినిధి ఖండించారు. కియారా అద్వానీ ఏ ఆసుపత్రిలో చేరలేదని.. ఆమె ఆరోగ్యంగానే ఉందని బిజీ షెడ్యూల్ కారణంగా విశ్రాంతి తీసుకోవాలని అనుకుందని అంతే తప్ప సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు ఫేక్ అని తెలిపారు.కియారా అద్వానీ నటిస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. రామ్ చరణ్ కథానాయకుడిగా.. నటిస్తున్న ఈ సినిమాకు శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. దాదాపు 3 ఏండ్లకు పైగా షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది కియారా. రీసెంట్‌గా ఆరోగ్యం బాలేక గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఈవెంట్‌కి కూడా రాలేదు ఈ అమ్మడు. ముంబై ప్రమోషన్స్‌లో పాల్గొంటున్న ఈ అమ్మడు ప్రస్తుతం విశ్రాంతి తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. దిల్ రాజు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, నాజర్, ప్రకాష్ రాజ్, సునీల్, జయరామ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# నాకు మీ సపోర్ట్ కావాలి..



టాలీవుడ్ అగ్ర నిర్మాత నాగవంశీ అభిమానులను ఉద్దేశించి ఆసక్తికర పోస్ట్ పెట్టాడు. ఇది మన అందరి సినిమా. నాకు మీ అందరి సపోర్ట్ చాలా అవసరం ఎక్స్ వేదికగా అభిమానులను రిక్వెస్ట్ చేస్తున్నాడు.వివరాల్లోకి వెళితే.. ఆయన నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం డాకు మహారాజ్ . నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. వాల్తేరు వీరయ్యతో 2023లో బ్లాక్ బస్టర్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రబృందం.ఇదిలావుంటే ఈ సినిమాలోని దబిడి దిబిడి సాంగ్‌పై నెట్టింటా ట్రోల్స్ వస్తున్న విషయం తెలిసిందే. దీంతో మూవీపై కూడా నెగిటివ్ ట్రెండ్ చేస్తున్నారు నెటిజన్లు. మరోవైపు ఎన్టీఆర్ ఫ్యాన్స్ కూడా ఈ సినిమాపై ఆసక్తి చూపించట్లేదు. ఇప్పటికే నందమూరి ఫ్యామిలీలో ఉన్న గొడవలతో బాలకృష్ణ, తారక్ దూరంగా ఉంటూ వస్తున్నారు. రీసెంట్‌గా దేవర సినిమా అప్పుడు కూడా బాలకృష్ణ ఎటువంటి రెస్పాన్స్ ఇవ్వకపోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. దీంతో బాలకృష్ణ డాకు మాహరాజ్‌ని టార్గెట్ చేస్తున్నారు తారక్ ఫ్యాన్స్.

# ఎటెళ్లాలో అర్థంకాక..?

రుక్మిణి వసంత్



కథానాయిక రుక్మిణి వసంత్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి శాండిల్‌వుడ్‌లో బాగా హల్‌చల్ చేస్తున్నది. వివరాల్లో కెళ్తే.. ఈ ముద్దుగుమ్మ ఇటీవలే ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ సినిమాకు సంబంధించిన అగ్రిమెంట్‌లో సంతకం చేసింది. తమ సినిమా పూర్తయ్యేంతవరకు మరో సినిమా చేయకూడదని ఒప్పందం సారాంశం. ఇదిలావుంటే.. దీనికంటే ముందే 'కాంతార-2'కు కూడా సైన్ చేసింది. ఈ సినిమా అయ్యేంతవరకూ మరో సినిమా చేయకూడదని రిషబ్‌శెట్టి ఒప్పందం. దానిక్కూడా ఓకే అనేసి, అడ్వాన్స్ అందుకుంది. ఈ రెండు సినిమాలకే కాక, చిన్నాచితకా సినిమాలక్కూడా ఓకే చెప్పిందట. ఈ సినిమాలన్నీ ఈ ఏడాదే షూటింగ్స్ జరుపుకోనున్నాయి. దాంతో తీసుకున్న డబ్బుల్ని వెనక్కి ఇవ్వలేక, ఎటెళ్లాలో అర్థం కాక, బోనులో చిక్కుకున్న ఎలుకలా ఉక్కిరిబిక్కిరి అవుతున్నదట ఈ అందాల భామ. ఓ ప్లానింగ్ లేకుండా అగ్రిమెంట్లపై సంతకాలు చేసినందుకు అటు ప్రశాంత్‌నీల్, ఇటు రిషబ్‌శెట్టి ఈ ముద్దుగుమ్మపై కోపంగా ఉన్నారట. మరి ఈ సమస్యల నుంచి రుక్మిణి ఎలా బయటపడుతుందో చూడాలి. ప్రస్తుతం ఈ వార్త కర్ణాటక సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.